# నల్లమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మకతలు

లింగారెడ్డి పల్లెకు బోయినప్పుడు మా బెన్ని జూన్ను వాళ్లింటికి బోయిన. పాయ్యే తలికి ఇంగేముంది? గుడిసె చుట్టూ పందులు గునగునమంటా తిరగతా వుండాయి.

మా బెన్ని మావ నల్లంగ దున్నలాగుంటడు. కస్టం జేసే దానికే పుట్టినట్టుంటడు. నను సూడగానే గబాల్న లేసి "రా సుదయ్యా! శాన్నాలయ్యింది నిన్ను జూసి, మీ సెల్లెలు సెండ్లికి గావాల జూసిన " అంటానే గట్టిగా రంకేసిండు.

"మ్మేయ్! సంకటి తీసకరా! అబ్బయ్య ఆకలి గొనిచ్చిండు గావాల" అని లోపలున్న మా యత్తని అదిలించిండు.

అప్పుడు బెన్నిమావ గడపముందు కూచ్చోని సంకటి తింటున్నడు. గిన్నిలో ఈరిగలూ; గుండె కోని రావిగుంటపల్లెంతా సెడ తిరిగే వాడు. మీ జేజి నాయన దేవయ్యని రాజులాగ బెంచిండులే. బో యిదిగా గద్దిపాటలు పాడతా వుండేవోడు. పిల్ల గనిపిస్తే సెనికే వోడు. కయిగట్టేవోడు. పట్నం బోయినంక మనిసే మారిపోయిండ్లే. అప్పుడే సచ్చిపోయిండా మీ నాయన?

సుదయ్య! "మీ నాయనలాగ నువ్వుగూడ కయికడతావంటవే" అనేప్పటికి నా కైతలు యిని పించబుద్దిగాలా! నాకు చిగ్గేసింది.

"మావా అయ్యన్ని ఎందుకుగానీ నీ యివరాలు జెప్పు" అని మాట మార్చిన.

బెన్ని మావ తన గ్యేపకాల కత్తిదీసి బతుకు తోలు సెల్ల దీస్తూ తన కత జెబుతా వుంటే సంకటి దింటూ యింటూ వుండ.....

దారిలో మము జూచి
దూరాదూరముగానీ
దొలగీ పోయేదయ్యో దేవా!
మేము మీ తోటి నరులము గామా!
బయము బుట్టించే దయ్యాముల మా?
కసిబెట్టే కందిరీగలామా?
తరిమి గరిసే తాసూ పాములామా?
అయ్యో సిన్నాబుచ్చుకు రయ్య
ఇది మీకు మర్యాదా?
మాకొద్దు నల్ల దొరతనమూ
ఎరికాలూ యానాదు లెగ్గూ బట్టక వారు
కలువూకోని తిర్గుతారు
సెంచూ లంబాడూల నంటుతారు
అంట్లుతోనైనా బత్కానివరండీ

* * *

## మనకీ గొడ్డుకీ తేడా ఏవుంది సుదయ్యా!

కాయ ముక్కలూ, నెరిడా, ఉలవ గాయలూ ఎండకు దగదగ మెరుస్తావుండాయి. ఆ మజ్జానం దున్నన గోసింద్రేమో! బెన్నిమామ గుడిసె ముందు మా మాదిగ తల్లికి మంచి తునకల దండ ఏలాడతా వుండాది.

గొడ్డుని కోసింద్రంటే మా గూడేలకి గొప్ప కుశాలగుంటది. ఎవురి మొగాల్లో జూసినా మాంసం కళ ఆడతా వుంటది. బండల మీన కారం నూరేవోళ్లూ, మంట బెట్టి గెట్ట కాళ్లు కాల్చేవోళ్లూ, నెత్తురు మాడ్చుకుని తినే వోళ్లూ చియ్యల్ని ఎండ బెట్టే వోళ్లూ యాడబట్టినా కవుసు వాసనే! ఎవురి సమల్లో వోళ్ళు కుశాలగుంటరు. ఈగెల్లే ముసురుకుంటున్న నా ఆలోచనల్ని యిసిరి గొడుతూ మావ నన్ను పలకరిస్తున్నడు.

"ఏ సుదయ్యా మీ నాయన సచ్చిపోయిండంటనే! ఎట్లుండేవాడు మీ నాయన బో అలాటప్పోడు. మాటకి పాట గట్టేవోడు. సిన్నప్పుడు దేవయ్య సిందు లేసే వోడు. జులపాల జుట్టూ, సెవులకి పోగులూ, మెడకి ఎండి కంటె, ఎడం కాలికి కడియం, ఏసు

మన సెరిత్ర సెప్పేవోళ్లు యిప్పుడెవరూ లేరయ్యా! పెద్దోళ్లంతా ఎల్లిపోయినారు. మా నాయన పేరు మొద్దు గురయ్య. మొద్దు పన్లు జేసేవోడు. మా నాయన మొండే జ్యాలకు మొగుడు. ఎవుడికీ అలివివయ్యేవోడు గాదు మా యబ్బ!

మా అయ్య బోపక్కంగ సెప్పులు కుట్టేవోడు. ఒక తూరి నక తెల్లదొరకు సెప్పులు కుట్టిస్తే ఆ మెత్తని సెప్పులు బిసుగుతూ దొర బిత్తర బోయిండంట. ఇంగ ఆ దొరే నాకు 'బెన్నీ'యని పేరు బెట్టిండు. ఆ తెల్లదొరలు బోయిరి. ఆళ్లన్నా కూసింత దగ్గిరికి రానిచ్చేవోళ్లు. మన మీద జాలిగ చెయ్యేసే వోళ్లు. ఈ నల్ల దొరలుండరే! ఈళ్లు తాసుపాములు. మన నోసన దగిల్తే కస్సుమంటరు. ఈళ్లమీద సిన్నప్పుడు పాటలు పాడుకునే వోళ్లం. ఆపాట మతికున్నంత కాడికి యినిపిస్తాయిన. అది కుతికలోనే యియ్యాల్టిదాకా కొటకలాడతా వుండాది.

మా కొద్దూ నల్లదొరతనమూ!
బాబు! మాకొద్దు నల్ల దొరతనమూ!
మా మాలా మాదిగలంటే
మండిపడీ పస్తారు
మాకొద్దూ నల్లదొరతనమూ

* * *

అబ్బో! యెన్ని అవమానాలో! దెగ్గరికి రానిచ్చార్రా ఈ మగామబావులు. గాంధి మాత్మవొచ్చినాక గదూ!

తెల్లగుడ్డ గప్పుకోని బజార్నబొయ్యే దానికి రాతుందా? రానివ్వలేదు. కింద గుడ్డేసుకుని కూకుంటే బతక నిత్తుర్రా! తరిమి గొట్టేది. రెడ్లూ ఆసాములొస్తే మంచాల మీద కూసోడమా! ఎదుర్రాడమా? ఇంగేమైనా వుందా? మంచాల్లేంచి లెయ్యాల. ఎంత ముసిలోడైనా లెయ్యాల్సిందే. తల గుడ్డ తియ్యాల. సుట్టనోట్లో వుంటే అవతల బార మాకాల. తెల్లగుడ్డ యేసుకుంటే పైకి ఎగదోవుకోని బోవల. ఇంగమన ఆడకూతుళ్ల సంగతంటవా సెప్పదానికి ఈలుగాదు. అన్నకాడ అన్నరు. అనని కాడ అన్లా. అందమైన వొస్తువు కంటబడితే యిడిసి బెట్టింద్రా సుదయ్యా! మంచి వొస్తువుగవుంటే వోళ్లు దీసుగోక యెందుకు మామ

30.8.96 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

కున్నరు? మంచి వొస్తువుంటే తీసుకుంటరు. ఏ! మన ఆడోల్లేంది? ఈ ఆడోల్లేంది? చానా మోసం జేసిన్రు. కోపడమాక ఒక సచ్చెం జెబుతా!

కొవ్వుబట్టిన వాడికి కులముంటదా? అంటుంటదా?

* * *

మన మాదిగల సెరిత్ర ఏముందయ్యా! పూరవం మనమూ మగారాజులోలె బత్కి వోళ్లమేనంట. మరి యిప్పుడో! వూల్లెకి ఈ యవతారంతో పొయ్యేందుకవుద్దా! పాత గుడ్డలూ పాత సొక్కాయిలూ. ఓయ్! ఎక్కన్నే దూరంగ నిలబడాల్సిందే. ఎక్కన్నైనా వడిముణ్ణిన దప్పికయ్యిందంటే దోసిల బట్టుకుని నిలబడితే అల్లు దయ దలచి బోస్తే తాగి బోవాల్సిందే! ఏ బాయిలో బడితే ఆ బాయిలో తాగడానికి ఈల్లేదు. శావా బాదలు బడ్డం. అయితే మాదిగోడు మాత్రం మనిసిని మనిసిలాగే జూస్తడు. అన్నాయం జెయ్యడు. వుంటే తింటడు. లేన్నాడు పస్తులు పండుకుంటడు.

* * *

ఆ సంసారుల్ని ఎదిరిచ్చి సంకటి తినగలమా? ఎదిరిచ్చితే ఏమవుద్ది? ఖాలి సమల్లేవు. గింజల్లేవు. తోలు గీలు దొరుకుద్దా! నీల్లు లే, నిప్పల్లే, పేగులెండ బెట్టుకోని కూకోవలిసిందే. మన బతుక్కంతా స్తాయిగాని స్తితే. అనాడు చెప్పుకోవడానికి ఏముండది? పొద్దున్లేసినాల మంచి సెప్పులు కుట్టేది. దొర్కితే గొడ్డును దెచ్చుకునేది. కోసుకుండేది. దూడను దెచ్చుకునేది, ఆ సచ్చినోడుని దినేది. ఆ తోలు దీసేది. వోళ్లకి శాకిరి జేసేది. వోళ్ల చేత నానా తిట్లు బడేది. కొట్ల బడేది. మనకి గొడ్డుకి తేడా యేముంది సుదయ్యా?

అదివరలో మవోళ్లు సచ్చినయ్యి దినేది. ఇప్పుడు మాతరం బతికినయి తింటుండ్రు. మతమొకటి బట్టిచుకున్న తర్వాత మవోళ్లు శానామంది పాలి చ్చుకున్నర్లే సామి! సచ్చిన గొడ్డును ప్రెబువు తినొద్దన లేదు గానీ దాని రగతమనేది మాతరం తినొద్దన్నడు. మరి వాలోటోడు నెత్తురుగూడా మాడ్చుకోని తింటుండ్లా! మరి యాంజేసేది. అది మంచిదిగాదని ప్రెబువు సెప్పిండు. అన్నీ ప్రెబువు జెప్పినట్టు జేస్తుండమా?

* * *

మా బెన్నిమామ గొప్ప పాటగాడు, ఆటగాడు యాడ తిర్నాలైనా ఆయముండాల్సిందే! ఊళ్లో ఏ కులపోళ్ల పెళ్లైనా ఎగరాల్సిందే! సిన్నప్పటిమంచి దప్పు గొడతా, సిందులేస్తా వున్నడు. అల్లు పదో పరకో యిస్తే సారాయి బోరాయి తాగతాడు. తాగితే ఇంగ బట్టలేము. పలకైనా పగలాల. మత్తైనా దిగాల. అదీ మా బెన్ని మామంటే.

"మావా! మన పాటొకటందుకో" అనే తలికి తువుక్కుమమ్మేసి ఆకూ వక్క వూసేసి ముంతలో నించి నీల్లు దీసుకొని నోరు పుక్కిలించుకున్నడు.

పాట మొదలు బెట్టిండు.

తాయిల్లే! లిల్లియో
సెబుతారో లిల్లియో!
మాదీగా వాడా!
మాదారెసేదా!
కావులు బిలిశారు రావోయి మాదిగా!

కల్లూ దాగీ నేము
కైపూలో వున్నాము
సారాయికే నాకు జగ్గమయా!
తాయిలో! లిల్లియ్యలో
సెబుతారోలే! లిల్లియలో

సెక్కా దంచామన్న
దంచాడయా
పిల్లోన్ని బట్టమంటే
బట్టాడయా!

"సుదయ్యా పాటలన్నీ లోపల ఎండిపోతావుండాయి. వొగినయి పోతుండ్లా! మర్చిపోతావుండా!"

బెన్ని మామ పాడేయి జానపదాలు గావు. అయ్య వూళ్లో వాళ్లు బాడుకునేయి. గూడెంలో బాడే మాదిగ పాటలన్నీ మాదిగోల్లే కయికడతరు. "మావా! ఇప్పటికే శానా పొద్దుబోయింది గానీ వకమంచి పదం బాడు. మా సెల్లెలు పెల్లికి మవోల్లు పలకలు వాయిస్తావుంటే మవ్వు గజ్జలు గట్టుకోని సిందులేస్తా బాడితివే ఆ పాట బాడు అవన్న.

ఆ పాట గుర్తుకు దెచ్చేలేకి గాలికూగే కొర్రసేను లాగా యిరగబడి నవ్వుతూ ఆ పాటందుకున్నడు.

"పిల్లా పిల్ల ఒకమాట జెబుత
నీ మనసు మంచుకోయే!
నీ మొగుడు జచ్చిన ఆరునెల్లకే
నన్నే దగులుకోయే

నోన గురవలేదు
నొద్దు బండలేదు
నొచ్చే కరువు జూడే

నీ బుజాన కడవా
బూమిని జించగ-వక
మాట జెప్పిపోయే

రాయె రాయె ఓవారి సుందరీ
నవురు ముకముదానా
నీ తొడా నట్టము
సిక్కా జిక్కమూ
బలే దాబుగా నువ్వదే!"

బెన్ని మామ గొంతు మబ్బుల దాకా పెరిగింది. ఆ పాట నేనే గాదు మా గూడెవే గాదు కవిగిరి కొండేగాదు పైన నుక్కలూ కింద చెల్లచెట్లూ అన్నీ వొళ్లు మరిచి యింటా వుండియయ్యి......




–ఎండ్లూరి సుధాకర్